నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I హైదరాబాద్, సోమవారం 6 జనవరి 2025 | RANGAREDDY




రైతు భరోసా డబ్బులివ్వాలని నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్, రైతులు, నాయకులు

## భరోసా బకాయిలు ఇచ్చేదెప్పుడు..?

- బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్
- మోమిన్‌పేటలో రైతులు, నాయకులతో కలిసి నిరసన

వికారాబాద్, జనవరి 5 : భరోసా బకాయిలు ఇంకెప్పుడు ఇస్తారని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మోమిన్‌పేట మండలంలో నాయకులు, రైతులతో కలిసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. రైతు భరోసా బకాయిలు మొత్తం చెల్లించకుంటే కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తిరుగనివ్వబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి, మోమిన్‌పేట మండలాధ్యక్షుడు వెంకట్, కౌన్సిలర్ గోపాల్, పీఏసీఎస్ చైర్మన్లు విష్ణువర్ధన్ రెడ్డి, రామచంద్రా రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరాములు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, యువజన విభాగం మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మైనారిటీ సెల్ మండలాధ్యక్షుడు మహబూబ్‌అలీ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## చలికి గజగజ..

### వికారాబాద్ జిల్లాలో 9 డిగ్రీలకు పడిపోయిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు

వికారాబాద్, జనవరి 5 : కొన్ని రోజులుగా వికారాబాద్ జిల్లాలో చలి తీవ్రత బాగా పెరిగింది. దీంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. జిల్లాలో 9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా.. కోట్‌పల్లి మండలంలో 8 డిగ్రీలకు పడిపోయింది. ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా తక్కువగా నమోదు కావడం ఆందోళన కలిగిస్తున్నది. చలి తీవ్రతతో సాధారణంగా వచ్చే జలుబు, దగ్గు, శ్వాసకోశ వ్యాధులకు తోడు మరిన్ని కొత్తవి చుట్టుముట్టే అవకాశం ఉన్నదని వైద్యులు పేర్కొంటున్నారు. రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలంటున్నారు.

### అవసరమైతేనే..

ఉదయం 8 గంటల తర్వాతే ఇంటి నుంచి బయటికెళ్లాలి. అత్యవసరమైతే విధిగా స్వెట్టర్లు, కాళ్లకు బూట్లు, సాక్సులు, తలకు ఉలెన్ క్యాప్స్ పెట్టుకుని వెళ్లాలి. రాత్రి 7 గంటల తర్వాత చిన్నాపెద్ద తేడాలేకుండా అందరూ బయట తిరగొద్దు. వెచ్చని నీటితో స్నానం చేయాలి. గోరువెచ్చని ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. శీతల గిడ్డంగుల్లో పనిచేసే కూలీలు అప్రమత్తంగా ఉండాలి. అరగంటఓసారి గిడ్డంగుల నుంచి బయటికి రావాలి. ఉదయం 9–10 గంటల మధ్య ప్రతి ఒక్కరూ తమ శరీరంపై కనీసం అరగంట పాటు సూర్యకాంతి పడేలా చర్యలు తీసుకోవాలి.

### జాగ్రత్తలు తప్పనిసరి



రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతున్నది. చిన్నారులు, వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలి. గోరువెచ్చని నీటినే తాగాలి. బయటికెళ్లే సమయంలో వేడినిచ్చే దుస్తులను ధరించాలి. కాళ్లకు సాక్సులు, షూలు, తలకు మంకీక్యాప్‌లు పెట్టుకోవడం మంచిది. చలితో దగ్గు, జలుబు, ఫ్లూ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నది. దగ్గు, జలుబు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఆస్తమా ఉన్నవారు చలి గాల్లులో తిరగొద్దు.

– డా. రామచంద్రయ్య, సూపరింటెండెంట్, వికారాబాద్ ప్రభుత్వ దవాఖాన





ఆదివారం తెల్లవారుజామున 5 నుంచి ఉదయం 7 గంటల వరకు షాబాద్ మండలాన్ని పొగమంచు కమ్మేసింది. దీంతో మండలంలోని సర్దార్‌నగర్, నాగరగూడ, షాబాద్ తదితర ప్రాంతాల్లోని ముంబయి–బెంగళూరు లింకు జాతీయ రహదారిపై వాహనాలు లైట్లు వేసుకుని వెళ్లాయి. గ్రామాల ప్రజలు చలికి గజగజ వణికిపోయారు. – షాబాద్, జనవరి 5

## నమ్మించి మోసం చేశారు..

- బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్
- అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలిపిన బీఆర్ఎస్ శ్రేణులు
- ధర్నా చేస్తున్న నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు



అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

వికారాబాద్, జనవరి 5 : కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీల పేరుతో ప్రజలను నిలువునా ముంచిందని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం వికారాబాద్‌లో అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలిపి నివాళులర్పించారు. అనంతరం బీజేఆర్ చౌరస్తాలో ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ధర్నా చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 6 గ్యారెంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందన్నారు. రైతు భరోసా పేరుతో రూ.15వేలు ఇస్తామని రైతులను నమ్మించి.. రూ.12వేలు వేస్తామనడం సరికాదన్నారు. రూ.2లక్షల రుణ మాఫీ చేస్తామని రైతులను నిలువునా మోసం చేసిందని మండిపడ్డారు. జిల్లాకు చెందిన సీఎం రేవంత్‌రెడ్డి, వికారాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే, స్పీకర్ ఇంతవరకు ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. వుడా పేరుతో నాలుగు నియోజకవర్గాల మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తామని అబద్ధపు ప్రచారాలు మానుకోవాలన్నారు. గత సంవత్సరం నుంచి వికారాబాద్ ప్రాంతానికి ఒక్క అభివృద్ధి పనికీ నిధులు, పనులు పూర్తి చేసిన పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా వికారాబాద్ జిల్లాను అభివృద్ధి వైపు తీసుకుపోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు కృష్ణయ్య, జిల్లా యువ నాయకులున్నారు.




మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టు పర్యాటకులతో కళకళలాడింది. ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో తరలివచ్చి.. ఆహ్లాదకరమైన ప్రాజెక్టు అందాలను తిలకించడంతోపాటు నీటిలో సెల్ఫీలు దిగుతూ.. బోటింగ్ చేస్తూ సరదాగా గడిపారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడ సందడి నెలకొన్నది. ప్రాజెక్టులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. – ధారూరు, జనవరి 5

# యథేచ్ఛగా దందా..

## పట్టపగలు కొనుగోలు.. రాత్రిపూట తరలింపు

- రంగారెడ్డి జిల్లాలో విచ్చలవిడిగా రేషన్ బియ్యం అక్రమ రవాణా
- కోళ్ల ఫారాలు, రైస్ మిల్లులకు అధిక ధరలకు విక్రయం
- ప్రతి నెలా జిల్లా నుంచి 5 నుంచి 6 మెట్రిక్ టన్నుల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలింపు
- కొరవడిన విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల నిఘా
- మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతున్న అక్రమ వ్యాపారం

రంగారెడ్డిజిల్లాలో రేషన్ బియ్యం వ్యాపారం బహిరంగంగా సాగుతున్నది. గ్రామాల్లో వ్యాపారులు నేరుగా ఇండ్ల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. జిల్లావ్యాప్తంగా ఎక్కడ చూసినా రేషన్ బియ్యం బహిరంగ మార్కెట్‌లో విచ్చలవిడిగా దొరుకుతున్నది. కొంతమంది వ్యాపారులు నేరుగా గ్రామాలకు వెళ్లి పగటిపూట రేషన్ షాపులతోపాటు ప్రజల వద్ద కొనుగోలు చేసి రాత్రి పూట వాటిని గ్రామాల నుంచి తరలిస్తున్నారు. దీని కోసం ఏకంగా గోడౌన్‌లను అద్దెకు తీసుకుని ఆ బియ్యాన్ని వాటిలో నిల్వ ఉంచి రైస్ మిల్లర్లకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీన్ని అరికట్టాల్సిన సివిల్ సప్లయ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎక్కడా కనిపించడంలేదు. ఎస్‌వోటీ పోలీసులు అడపాదడపా దాడులు జరుపుతున్నారు. ఈ దాడుల్లో పెద్దఎత్తున రేషన్ బియ్యం పట్టుబడుతున్నది. జిల్లావ్యాప్తంగా రేషన్ బియ్యం వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతున్నది.

– రంగారెడ్డి, జనవరి 5 (నమస్తే తెలంగాణ)



కొహెడ సమీపంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసిన గోదాం

### రూ.15లకు కొని.. రూ.30కి విక్రయం

అక్రమ వ్యాపారులు గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఓ చోట నిల్వ ఉంచుతున్నారు. రాత్రి పూట గోడౌన్లకు తరలిస్తున్నారు. డీలర్లు కొంతమంది కార్డు యాజమానుల వద్ద రూ.10నుంచి రూ.15లచొప్పున కొనుగోలు చేసి.. ఏజెంట్లకు కిలోకు రూ.2, 3 ఎక్కువగా అమ్ముతున్నారు. రైస్ మిల్లులు, కోళ్ల ఫారాలకు రూ.30 నుంచి రూ.40 చొప్పున విక్రయాలు జరుపుతున్నారు. రైస్ మిల్లర్లు టన్నుల కొద్దీ రేషన్ బియ్యం కొనుగోలుచేసి వాటికి పాలిష్ చేసి రూ.50 నుంచి రూ.60చొప్పున విక్రయిస్తున్నారు. ఈ తతంగమంతా బహిరంగ మార్కెట్‌లో యథేచ్ఛగా జరుగుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

### ప్రతి నెలా జిల్లాకు 11,556 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం

జిల్లాకు ప్రతి నెలా 11,556 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అందజేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 5,38,360 రేషన్ కార్డులుండగా.. 936 రేషన్ దుకాణాలున్నాయి. కార్డులున్నప్పటికీ కొంతమంది బియ్యం తీసుకోవడానికి రావడంలేదు. మరికొంతమంది రేషన్ షాపుల వద్దకు వెళ్లి బయోమెట్రిక్ పెట్టి డీలర్ల నుంచి డబ్బులు తీసుకుని వెళ్లిపోతున్నారు. ఇలా మిగిలిపోతున్న బియ్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు కొంతమంది కార్డుదారులు తమకొస్తున్న బియ్యాన్ని మధ్యదళారులకు విక్రయిస్తున్నారు. ప్రతి నెల జిల్లావ్యాప్తంగా సుమారు ఐదు నుంచి ఆరు మెట్రిక్ టన్నుల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నట్లు తెలిసింది. ఈ వ్యాపారంతో మధ్యదళారులు కోట్ల రూపాయలను గడిస్తున్నారు.

### కేసులు నమోదు

జిల్లాలోని యాచారం మండలం మేడిపల్లి, పల్లెచెల్కతండా, నందివనపర్తి, మొండిగౌరెల్లి గ్రామాల్లో ఇటీవల పోలీసులు రేషన్ బియ్యాన్ని పెద్దఎత్తున పట్టుకున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని ఎలిమినేడు, కొహెడ ఎక్స్ రోడ్డు, ముకునూరు తదితర గ్రామాల్లో, చేవెళ్ల, షాద్‌నగర్, కందుకూరు డివిజన్లలో కూడా బియ్యాన్ని పట్టుకుని కేసులు నమోదు చేశారు.

### ఔటర్ రింగ్ రోడ్డు కేంద్రంగా..

అక్రమార్కులు ఓఆర్ఆర్‌ను కేంద్రంగా చేసుకుని గోడౌన్లను అద్దెకు తీసుకుని జిల్లా నలుమూలల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని నిల్వ చేస్తున్నారు. నగర శివారుల్లోని మన్నెగూడకు చెందిన ఓ వ్యాపారి ఓఆర్ఆర్ పక్కనే గోడౌన్‌ను అద్దెకు తీసుకుని అక్రమ బియ్యం వ్యాపారాన్ని కొనసాగిస్తుండగా.. ఇటీవల జరిపిన పోలీసుల తనిఖీల్లో 14 టన్నుల బియ్యం పట్టుబడింది. కొంతమంది ఓఆర్ఆర్ సమీపంలో బియ్యం నిల్వ ఉంచి ఇటుక బట్టీల వద్ద పనిచేసే ఒడిశా కార్మికులు, రైస్ మిల్లులు, కోళ్లఫారాలకు పెద్దఎత్తున విక్రయిస్తున్నారు. రేషన్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు హెచ్చరిస్తున్నారు.



గోదాంలో అక్రమంగా నిల్వ చేసిన బియ్యం

# మరో ఎస్ఆర్డీపీ ఫలం

## నేడు ఆరాంఘర్- జూపార్క్ ఫ్లై ఓవర్ ప్రారంభం

- రూ.799.74 కోట్లతో వంతెన నిర్మాణం
- విమానాశ్రయానికి సాఫీగా సాగనున్న ప్రయాణం
- కేసీఆర్ ప్రభుత్వంలో రూ.5937 కోట్లతో ఎస్ఆర్డీపీకి శ్రీకారం
- ఎస్ఆర్డీపీ ఫలాలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి...
- 42 ప్రాజెక్టుల్లో 37 ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీర్చిన బల్దియా
- ఇప్పటికే అందుబాటులోకి 22 ఫ్లై ఓవర్లు, 14 ఆర్వోబీ, ఆర్‌యూబీ
- ఈ ఏడాది చివరి నాటికల్లా మరో ఐదు ప్రాజెక్టులు

సిటీబ్యూరో, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్ఆర్డీపీ) ఫలాలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తున్నాయి.. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంలో భాగంగా గత కేసీఆర్ ప్రభుత్వం సిగ్నల్ రహిత ప్రయాణమే లక్ష్యంగా ప్రభుత్వం రూ.5,937 కోట్ల అంచనా వ్యయంతో జీహెచ్ఎంసీ 42 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. హెచ్ఎండీఏ, ఆర్‌అండ్‌బీ శాఖ ఐదు చోట్ల ఫ్లై ఓవర్లు చేపట్టింది. ట్రాఫిక్, వాహన రద్దీ ఉపశమనానికి ఎస్ఆర్డీపీ దోహదపడుతున్నది. ప్రయాణ వేగాన్ని పెంచడం, సమయాన్ని తగ్గించడం, వాయు కాలుష్యాన్ని తగ్గించడం, అంతేకాకుండా కనిష్ఠ భూ సేకరణ నిధుల ఆధారంగా ఎస్ఆర్డీపీకి ప్రాధాన్యత ఇచ్చారు. 42 ఫ్లై ఓవర్లలో 37 చోట్ల ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన అధికారులు.. తాజాగా రూ.799.74కోట్లతో ఆరాంఘర్ నుంచి జూపార్క్ వరకు ఆరు లేన్లతో 119 పిల్లర్లతో 4.08 కిలోమీటర్ల మేర చేపట్టిన అతి పొడవైన ఫ్లై ఓవర్‌ను సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ ఏర్పాట్లు పూర్తి చేసింది. జూపార్కు ఫ్లై ఓవర్ 23వ ఫ్లై ఓవర్ కాగా, ఇప్పటికే 14 చోట్ల ఆర్వోబీ, ఆర్‌యూబీలు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన ఐదు చోట్ల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఈ ఏడాది డిసెంబర్ నాటికల్లా ఎస్ఆర్డీపీ పూర్తి ఫలాలు అందుబాటులోకి తేస్తామని అధికారులు తెలిపారు.



### పురోగతిలో ఉన్న ఎస్ఆర్డీపీ ప్రాజెక్టులు ఇవే

| ప్రాజెక్టు | శాస్త్రీపురం ఆర్వోబీ | ఫలక్‌నుమా ఆర్వోబీ | శిల్పా లే అవుట్ ఫ్లై ఓవర్ (స్టేజీ-2) | నల్గొండ క్రాస్‌రోడ్ నుంచి ఓవైసీ హాస్పిటల్ జంక్షన్ నాలుగు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ | ఉప్పల్ జంక్షన్ ఫ్లై ఓవర్ |
| --- | --- | --- | --- | --- | --- |
| నిర్మాణ వ్యయం (రూ.కోట్లలో) | 71 | 47.10 | 275 | 370 | 311 |

### ఎట్టకేలకు ప్రారంభం..

ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి రావాల్సిన జూపార్కు –ఆరాంఘర్ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంపై రాజకీయ రంగు అలుముకున్నది. అధికార పార్టీ కాంగ్రెస్, ఎంఐఎంల మధ్య నెలకొన్న గ్యాప్‌తో ఈ ఫ్లై ఓవర్ వాహనదారులకు అందుబాటులోకి ఇంతకాలం తీసుకురాలేదన్న చర్చ అటు జీహెచ్ఎంసీ అధికార వర్గాలు, ఇటు పాలక మండల సభ్యుల్లో జరిగింది. వాస్తవంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజాపాలన–ప్రజా విజయోత్సవ సంబురాల్లో పురపాలికకు సంబంధించి ఈ నెల 3న పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరపాలని నిర్ణయించి కొన్నింటిని ప్రారంభించారు. అయితే షెడ్యూల్ ప్రకారం వర్చువల్ విధానంలో జూపార్కు–ఆరాంఘర్ ఫ్లై ఓవర్ ప్రారంభం ఉన్నదని ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. కానీ ఆ రోజు కుదరలేదని చెబుతూ వాయిదా వేశారు. ఆ తర్వాత 5వ తేదీ, 8వ తేదీ అంటూ వాయిదా వేస్తూ వచ్చారు. చివరకు 9న ఈ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేస్తామని సర్కారు ప్రకటించింది. కానీ నాలుగు దఫాలుగా వాయిదా వేస్తూ వచ్చిన అధికారులు ఎట్టకేలకు సోమవారం ప్రారంభిస్తుండడం గమనార్హం.

### పాత నగరానికి మహా రిలీఫ్

పాతనగరంలో ఇప్పటికే పలు ఫ్లై ఓవర్లు అందుబాటులోకి వచ్చి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికింది. ఓవైసీ ఫ్లై ఓవర్, అబ్దుల్ కలాం ఫ్లై ఓవర్, చాంద్రాయణ గుట్ట ఫ్లై ఓవర్ అందుబాటులోకి తీసుకురాగా..ఆరాంఘర్–జూపార్కు ఫ్లై ఓవర్‌తో శంషాబాద్ విమానాశ్రయం వరకు ప్రయాణం సాఫీగా సాగనున్నది. ఆరాంఘర్, శాస్త్రిపురం, కలాపత్తర్, దారుల్ ఉల్ం, శివరాంపల్లి, హసన్‌నగర్ జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీకి శాశ్వత ఉపశమనం లభించనున్నది. నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు రవాణా మెరుగుపరచడమే కాకుండా సిగ్నల్ ఫ్రీ రవాణా వ్యవస్థకు దోహదపడనున్నది. కాగా, భూ సేకరణలో నెలకొన్న జాప్యం కారణంగా సర్వీస్ రోడ్డు, ర్యాంపులు ఆలస్యం కానున్నది.

### ప్రాజెక్టు విశేషాలు

- ఆరాంఘర్ నుంచి జూపార్క్ వరకు 4.08 కిలోమీటర్ల మేర అతి పొడవైన ఫ్లై ఓవర్
- ప్రాజెక్టు వ్యయం రూ. 799.74కోట్లు
- 280 మీటర్ల మేరలో రెండు ర్యాంపులు (ఆరాంఘర్ వైపు 184 మీటర్లు, జూపార్కు వైపు 95 మీటర్లు)
- ఆరు లేన్లతో ఇరువైపులా మూడు లేన్లతో నిర్మాణం
- ఫ్లై ఓవర్ పొడవునా ఎల్ఈడీ లైటింగ్
- రాబోయే 20 ఏండ్ల ట్రాఫిక్ దృష్ట్యా ఫ్లై ఓవర్ నిర్మాణం